క్లుప్తంగా

మహిళా హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి


లేడీస్ హాస్టల్‌లో యువతులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్ఐ రాజు

సీతమ్మధార : మహిళా హాస్టళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ద్వారకా పోలీస్ స్టేషన్ క్రైం ఎస్ఐ రాజు కోరారు. ఈ మేరకు ఆయన శ్రీనగర్‌లో గల ప్రియా లేడీస్ హాస్టల్‌లో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో లాకర్లు ఏర్పాటు చేయడం ద్వారా చోరీలు నివారించవచ్చన్నారు. అలాగే, హాస్టల్‌లో వుండే యువతులు బంగారు ఆభరణాల భద్రత విషయంలో నిర్వాహకులు కూడా అప్రమత్తంగా వుండాలని సూచించారు. నగదు, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు లాకర్‌లో మాత్రమే భద్రపరుచుకోవాలని సూచించారు. హాస్టళ్లలో వుండే యువతులు చెడు స్నేహాలకు దూరంగా వుండాలని హితవు పలికారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హాస్టల్ మేట్రిన్ రమ, పాల్గొన్నారు.

యూజీడీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేత వెంకటరెడ్డి, యూజీడీ కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ యూజీడీ కార్మికులకు కొత్త వేతనాలు వెంటనే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి కోరారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. జీవో 36 ప్రకారం ఈ ఏడాది మార్చి నుంచి కొత్త వేతనాలు చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. జీవీఎంసీ ఎస్ఈ కూడా జీవో ప్రకారం వేతనాల నిమిత్తం ఫైల్ పెట్టారని తెలిపారు. గత కమిషనర్ బదిలీ కారణంగా కొత్త వేతనాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. ఫైల్ క్లియర్ చేయాలని కొత్త జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశామని వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికూటి రాజా, కోశాధికారి ఎం.సూరీడు, యూనియన్ నాయకులు, అధిక సంఖ్యలో యూజీడీ కార్మికులు పాల్గొన్నారు.

హైదరాబాద్-సంత్రాగచ్చి మధ్య స్పెషల్

తాటిచెట్లపాలెం: పండుగలు, వరుస సెలవులతో పలు రైళ్లు రద్దీగా ఉండడంతో ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్-సంత్రాగచ్చి-హైదరాబాద్ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.
హైదరాబాద్-సంత్రాగచ్చి(07069) స్పెషల్ బుధవారం ఉదయం 5.30 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 7.30గంటలకు దువ్వాడ చేరుకుని, 7.32గంటలకు బయల్దేరి మరసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రాగచ్చి-హైదరాబాద్ (07070) స్పెషల్ ఆగస్టు 15వ తేదీన మధ్యాహ్నం 3.50గంటలకు సంత్రాగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 5.38గంటలకు దువ్వాడ చేరుకుని, 5.40 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు 17-థర్డ్ ఏసీ, 2-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

రంగనాథన్ సేవలు మరువలేనివి

దాబాగార్డెన్స్ : జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి, నేషనల్ గ్రంథ పాలకుల దినోత్సవం సోమవారం నిర్వహించారు. ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు జ్యోతి ప్రజ్వలన చేసి రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రంగనాథన్ సేవలు కొనియాడారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

- నిర్వహణ లోపంతో అధ్వానంగా లాల్‌బహదూర్ శాస్త్రి పార్కు
- పార్కులో అడుగుపెట్టేందుకు భయపడుతున్న స్థానికులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


పార్కులో అధ్వానంగా ఉన్న మెట్లు


ఇదీ దుస్థితి : లాల్‌బహదూర్ శాస్త్రి పార్కులో రాళ్లు తేలిన లోపలి భాగం


పార్కులో పేరుకుపోయిన చెత్త

సీతంపేట : నలుగురికీ ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు నిర్వహణ లోపంతో రోత పుట్టిస్తోంది. చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది. ఆహ్లాదాన్ని పంచకపోయినా పర్వాలేదు కానీ... ఇక్కడి పార్కు వల్ల కొత్త తలనొప్పులు, ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో గల లాల్‌బహదూర్ శాస్త్రి పార్కు దుస్థితి.

జీవీఎంసీ 26వ వార్డు పరిధి ఎన్జీజీవోస్ కాలనీలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణ బాధ్యతను 2000 సంవత్సరం నుంచి గురజాడ యువజన సంక్షేమ సంఘం తీసుకుంది. సంఘం అధ్యక్షుడు గంగిరెడ్డి 2021 వరకు పార్కు నిర్వహణ బాధ్యతలు చూశారు. మొక్కలు నాటి, కూర్చునేందుకు బెంచీలు, పిల్లల ఆట పరికరాలు అమర్చారు. మొక్కలకు నీటి సౌకర్యం , లైటింగ్, చుట్టూ ప్రహరీ ఏర్పాటుతో సందర్శకులతో కళకళలాడేది. 2021లో గురజాడ సంఘం పార్కు నిర్వహణ బాధ్యత నుంచి తప్పుకుంది. 2022లో స్థానికంగా ఏర్పాటైన మరొక సంఘం బాధ్యతలు తీసుకుంది. వీరికి ఎవరూ సహకరించకపోవడంతో పార్కు నిర్వహణను గాలికి వదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. కనీసం పార్కును శుభ్రం చేసే వారు కూడా కరువయ్యారు. పార్కులో ఎక్కడపడితే అక్కడ చెత్త, తాగిపడేసిన మందు బాటిళ్లు, గ్లాసులు, చిప్స్ ప్యాకెట్ కవర్లతో రోత పుట్టిస్తుండటంతో జనం రావడం మానేశారు. సంపుపై సరైన మూత లేక దోమలు వృద్ధి చెందుతున్నాయి.

మందు, గంజాయితో హల్‌చల్

నిర్వహణ సరిగ్గా లేకపోవడం... పార్కుకు స్థానికులు రాకపోవడంతో ఇదే అదునుగా ఆకతాయిలు తమ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చేసుకున్నారు. చీకటి పడగానే మందు, గంజాయి తాగుతూ అల్లరి చేస్తూ, గొడవలు పడుతూ చుట్టు పక్కల వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలపై స్థానిక నివాసులు ఇప్పటికే పలుమార్లు ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు వచ్చి ఆ క్షణానికి హడావిడి చేసి వెళ్లిపోతున్నారు తప్ప..., నిఘా పెట్టి ఆకతాయిలపై చర్యలు తీసుకోకపోవడంతో సమస్య మళ్లీ మొదటికే వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది పార్కు ఎదురుగా ఉన్న అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన లేడీస్ హాస్టల్‌తో సమస్యలు మరింత ఎక్కువయ్యాయని చుట్టు పక్కల నివాసితులు వాపోతున్నారు. హాస్టల్‌లో ఉండే అమ్మాయిల కోసం వచ్చే అబ్బాయిలు రోడ్డుపైన గంటల తరబడి మాట్లాడటం, పార్కులో చెట్టాపట్టా లేసుకుని ముచ్చట్లాడుకోవడంతో తమ పిల్లలను పార్కులో ఆడుకోవడానికి కూడా పంపలేక పోతున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే ఎదురు దాడికి దిగుతున్నారని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో ఉన్న ఒకే ఒక విశాలమైన పార్కును సుందరంగా అభివృద్ధి చేసి అందరికీ ఆహ్లాదాన్ని పంచేలా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిర్వహణకు సహకారం శూన్యం

2022 నుంచి పార్కు నిర్వహణ బాధ్యత తీసుకున్నాం. సుందరీకరణ, నిర్వహణ కోసం ఎన్నిసార్లు సమావేశాలు నిర్వహించినా ఎవరూ రావడం లేదు. అభివృద్ధికి సహకరించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. పార్కు వల్ల ఇటీవల న్యూసెన్స్ పెరిగింది. ఇప్పటికే చాలా సార్లు ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు వచ్చి వెళ్లిపోతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుని పార్కును సుందరంగా అభివృద్ధి చేసి వాచ్‌మ్యాన్‌ను నియమించాలి.

– జి.పట్నాయక్, పార్కు నిర్వహణ కమిటీ ప్రతినిధి

పార్కుకు వెళ్లాలంటే భయమేస్తోంది

లాల్ బహదూర్ శాస్త్రి పార్కువల్ల చుట్టుపక్కల అపార్టుమెంట్లలో నివసిస్తున్న వారికి చాలా ఇబ్బందిగా ఉంది. చీకటి పడితే పార్కులో గంజాయి, మందు సేవించి అల్లరిచిల్లరగా గొడవ చేస్తున్నారు. నివాసాల మధ్య లేడీస్ హాస్టల్ ఏర్పాటుతో సమస్యలు మరింత పెరిగాయి. పిల్లలను పార్కుకు పంపాలన్నా, మహిళలు వెళ్లాలన్నా భయమేస్తోంది. నగరం నడి బొడ్డులో ఉన్న పార్కు దుస్థితి ఇలా ఉంటే జీవీఎంసీ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణం.

– సుమలత, గృహిణి, ఎన్జీజీవోస్ కాలనీ.

వర్షంతో ఉపశమనం


అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి ప్రాంతంలో కురుస్తున్న వర్షం

సీతంపేట : ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించారు. గత వారం రోజులుగా భానుడి ప్రభావంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన నగరవాసికి సోమవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురవక, ఉష్ణోగ్రతల పెరుగుదలతో వేసవి ఎండను తలపించాయి. వర్షాకాలంలో విపరీతమైన ఎండ తీవ్రతతో జనం ఇబ్బందులకు గురయ్యారు. ఆది, సోమవారాల్లో ఎండ తీవ్రత మరీ ఎక్కువగా కనిపించింది. ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో సోమవారం రాత్రి అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. చల్లటి గాలులు, వర్షంతో జనం ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

15న సాంస్కృతిక ప్రదర్శనలు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 15న వాకర్స్ పార్కులో నిర్వహించనున్న స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాగేశ్వరి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులతో కూచిపూడి, జానపద నృత్యాలు, పాశ్చాత్య నృత్య ప్రదర్శనలతోపాటు కురుక్షేత్రం పౌరాణిక పద్య నాటకంలోని శ్రీకృష్ణుని ఏకపాత్రాభినయం సీనియర్ పౌరాణిక కళాకారుడు ఎల్‌పీ నాయుడు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన కోరారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు అన్యాయం


మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్

సీతమ్మధార : బంగ్లాదేశ్‌లో హిందువుల మీద దాడులు జరుగుతున్నా ప్రపంచ దేశాలు మౌనం పాటించడం శోచనీయమని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురుద్వారా వద్ద గల స్మార్ట్ ఇన్ అతిథి గృహంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ పేరిట సాగుతున్న ఉద్యమంలో హిందువులను ఊచకోత కోయడం అన్యాయమన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచ దేశాలు మౌనవ్రతం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. బంగ్లాదేశ్‌లో 1947, 1971, 2024 సంవత్సరాల్లో జరిగిన ఉద్యమాల్లో హిందువులే నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందూ మహిళల పట్ల అమానుష దాడులు జరగడం గర్హనీయమన్నారు. బంగ్లాదేశ్ ఉద్యమం పేరిట భారత్‌లోకి చొరబాట్లు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ఐకరాజ్యసమితి, మానవ హక్కుల సమితి, మహిళా సంఘాలు ముందుకొచ్చి స్పందించాలని ఆయన కోరారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు భూపతిరాజు సుబ్బరాజు, విశ్వనాథం, బాబ్జీ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులకు అవస్థలు



స్వర్ణభారతి స్టేడియం పక్క రోడ్డులో భారీగా నిలిచిపోయిన వాహనాలు

సీతంపేట : స్థానిక రేసపువానిపాలెం స్వర్ణభారతి స్టేడియం పక్కన గల స్పెన్సర్స్ హైపర్ మాల్ వద్ద ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొద్ది రోజులుగా స్పెన్సర్స్‌లో ఆఫర్స్ ప్రకటించడంతో కొనుగోలు చేసేందుకు భారీగా వినియోగదారులు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో వినియోగదారుల వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 వరకు సమస్య తలెత్తుతుండటంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మాస్టర్ కృష్ణమాచార్య మార్గం స్ఫూర్తిదాయకం


ప్రశంసాపత్రాలు అందుకున్న మహిళలతో నిర్వాహకులు

తాటిచెట్లపాలెం : సమాజం కోసం సర్వస్వాన్ని సమర్పించిన మహోన్నతులు మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) అని జగద్గురు పీఠం (ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ కొనియాడారు. తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్‌లో సోమవారం జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె. నడిచిన మార్గం ఎందరికో స్ఫూర్తిదాయకమని, దేశ విదేశాల్లో అనేక మంది శిష్యులను సంపాదించిన అయన జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది అయన రచనలతో, బోధనలతో సంస్కారవంతులయ్యారని తెలిపారు. సంస్థ కార్యదర్శి బీఆర్‌కే రాజు మాట్లాడుతూ సామాన్యులకు సేవలందించడమే మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమన్నారు. అనంతరం ఇక్కడ వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన సుమారు 54 మంది మహిళలకు ప్రశంసాపత్రాలు, 11 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. నలుగురు చిన్నారులకు సంస్థ నిర్వాహకులు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో దాట్ల రాధ, ఇంద్రగంటి కాశీప్రసాద్, గొల్లపూడి రవి కుమార్, సీహెచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

భారీ గణేశుడికి సిద్ధమవుతున్న మండపం


దొండపర్తిలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పందిరి నిర్మిస్తున్న కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి రామాలయం సమీపంలో శ్రీవరసిద్ధి వినాయక పూజా మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండపం ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వరుసగా ఐదో ఏట వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో తయారు చేయిస్తున్న గణపతి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టిస్తామని చెప్పారు. వినాయక చవితికి రెండు రోజుల ముందుగానే విగ్రహం విశాఖకు చేరుకుంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, హోమాలు, సాముగరిడీలు, ప్రతి రోజూ భక్తులచే భజనలు ఉంటాయని తెలిపారు. అనుపు మహోత్సవానికి రెండు రోజుల ముందు మహా అన్నదానం చేస్తామని సర్వేశ్వరరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. స్థానిక కార్మికులు కొద్ది రోజులుగా భారీ మండపం ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఇనుప రాడ్లతో పందిరి నిర్మిస్తున్నారు.

పాఠశాలల్లో ఆటల సందడి


నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలో విద్యార్థినులు


ఉత్సాహంగా లెమన్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

సీతమ్మధార : స్థానిక 24వ వార్డులో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఎన్ఎంసీహెచ్)లో ఆటల పోటీలు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 15న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు కొద్ది రోజులుగా పలు ఆటల పోటీలు నిర్వహిస్తోంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, నాగభూషణం, వరలక్ష్మి, ప్రభావతి, రాధాదేవి, విజయకుమారి, పుష్పలత, శారద ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మంగళవారం స్కిప్పింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు క్రికెట్ పోటీలు ఇప్పటికే ముగిశాయి. విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని హెచ్‌ఎం తెలిపారు.


ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థినులు

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం పాఠశాలలో క్రికెట్, క్యారమ్స్, చెస్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీడీ సునంద్ తెలిపారు. మంగళవారం కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, టెన్నీ కాయిట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

20ఏ సిటీ బస్ పునరుద్ధరణకు వినతి


విష్ణుకుమార్‌రాజుకి వినతిపత్రం అందిస్తున్న నరవ ప్రకాశరావు

సీతమ్మధార : మద్దిలపాలెం డిపో పరిధిలో కొన్నేళ్ల క్రితం రద్దు చేసిన 20ఏ సిటీ బస్సును వెంటనే పునరుద్ధరించాలని సామాజిక కార్యకర్త నరవ ప్రకాశరావు కోరారు. ఈ మేరకు ఆయన సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దిలపాలెం డిపోకి చెందిన 20ఏ సిటీబస్ 1983 నుంచి హెచ్‌బీ కాలనీ నుంచి పాత పోస్టాఫీసుకి రాకపోకలు సాగించేదన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పూర్ణామార్కెట్, కురుపాం మార్కెట్, కనక మహాలక్ష్మి, కన్యకాపరమేశ్వరి అమ్మవార్ల దేవస్థానాలకు రాకపోకలు సాగించేవారన్నారు. అయితే అకస్మాత్తుగా ఈ సర్వీసు రద్దు చేయడంతో హెచ్‌బీ కాలనీ, పాత వెంకోజీపాలెం, సీతమ్మధార ప్రాంతాల ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం 69 నంబరు సిటీ బస్సులు మూడు మాత్రమే నడుస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ ఆర్ఎం, మద్దిలపాలెం డీఎంలతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ప్రకాశరావు తెలిపారు.

రోడ్లపై చెట్ల కొమ్మలతో ఇబ్బందులు


పీ అండ్ టీ కాలనీలో రోడ్డుపైనే చెట్టు కొమ్మలు


రోడ్డు పక్కన పేరుకుపోయిన చెట్టు కొమ్మలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి టీపీటీ కాలనీ దరి పీ అండ్ టీ కాలనీలో రోడ్లన్నీ చెట్ల కొమ్మలతో నిండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కొద్ది రోజుల క్రితం ఈపీడీసీఎల్ సంస్థ కాంట్రాక్ట్ సిబ్బందితో చెట్ల కొమ్మలు తొలగించారు. విద్యుత్ లైన్లకు ఆటంకంగా వున్న చెట్ల కొమ్మలను తొలగించి రోడ్డుపైనే పడేశారు. వాస్తవానికి చెట్టు కొమ్ములు ఏ రోజు తొలగిస్తారో అదే రోజు కాంట్రాక్టర్ వాహనం ద్వారా తరలించాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ ఈ రోజుకీ చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ సుధాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా మంగళవారం నాటికి చెట్టు కొమ్మలు తొలగిస్తామని స్పష్టం చేశారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎంఎల్ మీనా రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం బోలంగీర్‌కు చెందిన దోలమని రానా, బీహార్‌కు చెరందిన శివశంకర్ రేలు గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. విశాఖ మీదుగా ముంబయి, హౌరాకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి నుంచి సుమారు రూ.77,500 విలువైన 15.5కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిని జీఆర్పీ ఎస్ఐ శాంతారంకు అప్పగించగా, అరెస్టు చేశారు.

పాత నేరస్తుడు అరెస్టు

విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా గంజాయి కేసులో తప్పించుకుతిరుగుతున్న నిందితుడ్ని అరెస్టు చేసినట్టు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయానాయుడు తెలిపారు.

5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తదితరులు

దాబాగార్డెన్స్ : సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడిన రెల్లి కులస్థులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కోరారు. ఈ మేరకు తన సామాజిక వర్గ సభ్యులతో కలిసి సోమవారం రెల్లివీధి నుంచి ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్నప్పుడు అత్యధిక మంది మాదిగలు ఉండేవారని, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రాలో 40 నుంచి 50 లక్షల వరకు రెల్లి కులస్థులు ఉన్నారని చెప్పారు. రెల్లీలకు విద్యావకాశాలు ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు అందించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని, రెల్లి పారిశుద్ధ్య కార్మికులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్థులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. చొక్కాకుల రాంబాబు, కస్తూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.